
నమస్తే తెలంగాణ
హనుమకొండ
10 వరంగల్, శుక్రవారం 25 అక్టోబర్ 2024 HANUMAKONDA

భూమి కొనుగోలులో అవినీతి జరిగినట్లు ఆరోపణలు

# మహిళా సమాఖ్యలో నిధుల గోల్‌మాల్

- వెంకిర్యాలలో 4 ఎకరాల భూమికి రూ. 2.35 కోట్ల చెల్లింపు
- సమగ్ర విచారణ జరపాలంటూ జనగామ కలెక్టర్‌కు ఫిర్యాదు




జనగామ చౌరస్తా, అక్టోబర్ 24: చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్యలో భారీగా నిధులు గోల్‌మాల్ జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో సర్వే నంబర్ 233/సీ1/1/1/2/2లో 2.20 ఎకరాలు, సర్వే నంబర్ 233/సీ1/1/2/2లో 1.20 ఎకరాల చొప్పున మొత్తం 4 ఎకరాల స్థలాన్ని పట్టాదారుడు కందగట్ల అశోక్ నుంచి 2024 ఆగస్టు 24వ తేదీన సమాఖ్య పేరిట కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కూడా పూర్తికాగా పట్టాదారు పాసు పుస్తకం(ఖాతా నంబర్ 60650) కూడా జారీ అయింది. 2.20 ఎకరాల భూమికి మార్కెట్ వ్యాల్యూ ధర రూ.56227500 ఉండగా, 1.20 ఎకరాలకు రూ.33736500 చొప్పున ఉంది. ప్రస్తుతం వెంకిర్యాల గ్రామంలో సుమారు రూ. 30 నుంచి 35 లక్షలు మాత్రమే ధర పలుకుతుందని రైతులతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. జిల్లా సమాఖ్య ప్రతినిధులు మాత్రం ఎకరానికి రూ. 58.75 లక్షల చొప్పున 4 ఎకరాలకు కలిపి రూ.2.35 కోట్లు చెల్లించి భూమి కొనుగోలు చేశారు. తక్కువ ధర కలిగిన భూమిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయడంతో సుమారు రూ. కోటి వరకు అవినీతి జరిగిందనే అనుమానాలు మహిళా సంఘాల సభ్యుల్లో నెలకొన్నాయి. దీంతో గురువారం నర్మెట మండల సమాఖ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. అవినీతిపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు పలువురు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జిల్లా సమాఖ్యకు అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారిగా పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, బచ్చన్నపేట మండలాల నుంచి సుధ, స్రవంతి, చైతన్య ముగ్గురు ఉన్నారు. చెక్ పవర్స్ వీరికి ఉన్నాయి. జిల్లా సమాఖ్య కింద 12 మండల, 466 గ్రామైక్య, 11217 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా లక్షా 26 వేల 922 మంది సభ్యులు ఇందులో వాటాదారులుగా ఉన్నారు. 12 మండలాలకు సంబంధించిన సమాఖ్య బాధ్యులు ఈసీ మెంబర్లు, ఆఫీసు బేరర్లుగా ఉన్నారు. వీరందరి తీర్మానం మేరకే భూమి కొనుగోలు చేసినట్లు జిల్లా సమాఖ్య ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని, కొందరు కావాలనే సమాఖ్య పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా కుట్రలు చేస్తున్నారని తెలిపారు.

# టెస్టులకు బయటికే..

## పెద్దాస్పత్రికి సమస్యల జబ్బు


ఎంజీఎం ఆసుపత్రి

- ఎంజీఎంలో సరిపడా సిబ్బంది ఉన్నా.. పరీక్షలు నిల్
- ఆరోగ్య శాఖ నుంచి నిలిచిన కెమికల్ సరఫరా
- కొన్ని నెలలుగా పనిచేయని ఆర్‌ఎఫ్‌టీ ల్యాబ్
- కార్డియాలజీ విభాగంలో 2డీ ఎకోదీ అదే పరిస్థితి..
- వేధిస్తున్న మందులు, స్ట్రెచర్లు, వీల్‌చైర్ల కొరత
- ఆర్థిక భారమైనా ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రోగులు
- ఇరుకుగా ఎమర్జెన్సీ బ్లాక్, క్యాజువాలిటీ
- వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి దుస్థితి ఇది

వరంగల్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : పేరుగొప్ప ఊరు దిబ్బలా తయారైంది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి పరిస్థితి. ఉత్తర తెలంగాణ ప్రజలకు గుండెకాయ వంటి ఈ పెద్దాస్పత్రిని సమస్యల జబ్బు వెంటాడుతున్నది. వైద్యులు, సిబ్బంది, యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని విభాగాల్లో నిర్దేశిత టెస్ట్‌లు జరగటం లేదు. మందులు, ఇంజక్షన్లు, వీల్‌చైర్లు, స్ట్రెచర్ల కొరత వేధిస్తున్నది. ఫలితంగా ఇక్కడ ప్రజలకు ఆశించిన వైద్య సేవలు అందటం లేదు. ఈ ఆస్పత్రి ఓపీ బ్లాక్‌లోని బయోకెమెస్ట్రీ (91) ల్యాబ్‌లో కొన్ని నెలల నుంచి రీనల్ ఫంక్షన్ టెస్ట్ (ఆర్‌ఎఫ్‌టీ) పనిచేయటం లేదు. దీంతో లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, లివర్ ఫంక్షన్ టెస్ట్ (ఎల్‌ఎఫ్‌టీ), ఎల్‌డీఎల్, వీఎల్‌డీఎల్, ట్రైగ్లిజర్స్, హెచ్‌డీఎల్ తదితర పరీక్షలు ఇక్కడ చేయటం లేదు. కేవలం కొలెస్ట్రాల్ టెస్ట్ మాత్రమే చేస్తున్నారు. ప్రభుత్వం రూ. 15 లక్షలతో ఏర్పాటు చేసిన మిషన్ ఈ ల్యాబ్‌లో ఉంది. ఎమర్జెన్సీ బ్లాక్ 9వ నెంబర్ గదిలోని ఆర్‌ఎఫ్‌టీ ల్యాబ్‌దీ ఇదే దుస్థితి. వైద్య ఆరోగ్యశాఖ నుంచి కెమికల్స్ సరఫరా నిలిచిపోవటంతో ఈ సమస్య తలెత్తింది. దీంతో వైద్యం కోసం ఎంజీఎం దవాఖానకు వస్తున్న ప్రజలు ఆర్థిక భారమైనా తప్పనిసరిగా ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.



కార్డియాలజీ విభాగంలో మూసి ఉన్న 2డీ ఎకో టెస్ట్ రూం

### అందుబాటులో లేని 2డీ ఎకో..

ఎంజీఎం ఆస్పత్రి కార్డియాలజీ విభాగంలో 2డీ ఎకో టెస్ట్ అందుబాటులో లేకపోవటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విభాగంలో కార్డియాలజీ డాక్టర్లు ఉన్నప్పటికీ మూడు నెలలుగా టెస్టులు మాత్రం జరగటం లేదు. ఈ టెస్టు కోసం రోగులను అంబులెన్స్‌లో కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)కి పంపుతున్నారు. ఇక్కడే 2డీ ఎకో టెస్ట్ చేస్తే పేషెంట్లకు కేఎంసీకి వెళ్లి రావాల్సిన ఇబ్బందితో పాటు అంబులెన్స్ వాడాల్సిన అవసరం కూడా తప్పుతుంది.

### మందులు, ఇంజక్షన్ల కొరత

కేటాయింపులు తగ్గటం వల్ల ఎంజీఎం దవాఖానలో ప్రస్తుతం మందులు, ఇంజక్షన్ల కొరత ఏర్పడింది. పేషెంట్లకు వైద్యులు ఆరు లేదా ఏడు రకాల మందులు రాస్తే వీటిలో రెండు నుంచి మూడు రకాల మందులు లభించటం లేదు. దీంతో ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇంజక్షన్లదీ ఇదే పరిస్థితి. దీనికి తోడు వీల్‌చైర్లు, స్ట్రెచర్లు కూడా సరిపడా లేవు. కొన్ని సందర్భాల్లో అటెండెంట్లు రోగులను బెడ్స్ వద్దకు మోసుకెళ్తున్నారు. ఒక పేషెంట్‌ను వీల్‌చైర్ లేదా స్ట్రెచర్‌పై వార్డుల్లోకి తీసుకెళ్తే వాటిని తిరిగి తీసుకొచ్చే వరకు వేచి చూడాల్సి వస్తున్నది.


ఆసుపత్రిలో పనిచేయని సీసీ కెమెరా

### ఇరుకుగా ఎమర్జెన్సీ బ్లాక్



ఓపీ బ్లాక్‌లో ఊడిన భవనం పైకప్పు పెచ్చులు

ఎంజీఎం దవాఖానలోని ఎమర్జెన్సీ బ్లాక్ ఇరుకుగా ఉండటం వల్ల పేషెంట్లు, అటెండెంట్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎమర్జెన్సీ బ్లాక్‌లోని క్యాజువాలిటీ సరిపోక కిటకిటలాడుతున్నది. ఎమర్జెన్సీ బ్లాక్‌లో ప్రస్తుతం ఒకే ఎక్స్‌రే యంత్రం ఉండగా, ఇది పనిచేయని సమయంలో రోగులను ఓపీ బ్లాక్ వద్దకు తీసుకెళ్లాల్సి వస్తున్నది. ఓపీ బ్లాక్‌లో రద్దీ ఎక్కువగా ఉండే పలుచోట్ల భవనం పైకప్పు పెచ్చులూడి పడటం పేషెంట్లు, వైద్యులు, సిబ్బందిని ఆందోళనకు గురిచేస్తున్నది. ఆస్పత్రి, ఆవరణలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఎక్కడ ఏమి జరుగుతుందో పరిశీలించే, పర్యవేక్షించే పరిస్థితి లేదు. కాగా, ఈ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందికి కొన్ని నెలల నుంచి వేతనాలు అందలేదు. ఆఫీస్ స్టాఫ్ సహా సుమారు 140 మందికిపైగా ఇక్కడ పారామెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు.

# భీం పోరాటం స్ఫూర్తిదాయకం

- ఐటీడీఏలను బలోపేతం చేస్తాం
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి
- కుమ్రంభీం విగ్రహావిష్కరణలో మంత్రి సీతక్క



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం, అక్టోబర్ 24 : ఆదివాసీ సమాజం కోసం కుమ్రం భీం త్యాగాలు, పోరాటం స్ఫూర్తిదాయకమని పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో గురువారం కుమ్రం భీం విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ భీం నినాదం తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఒక వైపు గోదావరి, మరో వైపు అడవులున్నాయన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో దండారి పండుగకు ప్రభుత్వం రూ. 1.5కోట్లు కేటాయించిందన్నారు. ఐటీడీఏలపై సీఎంతో మీటింగ్‌ను ఆదివాసీ సంఘాలతో ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు ఐటీడీఏలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఐటీడీఏలు ప్రత్యేకంగా గిరిజనుల కోసం ఏర్పాటయ్యాయని, కేంద్రం నుంచి కూడా నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని, ఈ ప్రాంతంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే నిధులు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉట్నూరు, ఏటూరునాగారం ఐటీడీఏల భవనాలు శిథిలావస్థలో ఉన్నందున కొత్తగా నిర్మాణం చేసేందుకు ఎస్టిమేషన్లు ఇవ్వాలని పీవోలను కోరినట్లు తెలిపారు. ఐటీడీఏ ద్వారా ఇందిరమ్మ ఇండ్లను అట్టడుగు వర్గాలకు అందించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఐఏఎస్ అధికారి దివ్యను ఐటీడీఏ ప్రాంతాల అభివృద్ధిపై ఇన్‌చార్జిగా నియమించేందుకు సీఎం ఆలోచనలో ఉన్నారన్నారు. వెనుకబడి ఉన్న ప్రాంతాల అభివృద్ధి కోసం పనిచేసేందుకు కట్టుబడి ఉన్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమానికే ఐటీడీఏలున్నాయని, సంఘాలు ఏవైనా అవసరం ఉంటే తీర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీలోని అరకు ఎమ్మెల్యే రేగా మచ్చెలింగం, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, మైపతి అరుణ్‌కుమార్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, భీం విగ్రహ ప్రతిష్టాపన అధ్యక్షుడు చెరుకుల ధర్మయ్య, గౌరవ అధ్యక్షుడు నల్లబోయిన కోటయ్య, ప్రధాన కార్యదర్శి ఈసం నర్సయ్య, ఇర్ప కేశవరావు, తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ పొదెం రత్నం, ప్రొఫెసర్ ఈసం నారాయణ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆలం భిక్షపతిరావు, పులుసం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


నర్సింహులపేట రైతు వేదికలో నిద్రపోతున్న లబ్ధిదారులు

# చెక్కుల కోసం మహిళల తిప్పలు

### మూడున్నర గంటల పాటు నిరీక్షణ

నర్సింహులపేట, అక్టోబర్ 24 : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల కోసం మహిళలకు తిప్పలు తప్పలేదు. గురువారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రునాయక్ ఆలస్యంగా రావడంతో మూడున్నర గంటల పాటు లబ్ధిదారులు నిరీక్షించారు. కార్యాలయంలో మంచినీటిని ఏర్పాటు చేయకపోవడంతో చిన్న పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# 2న బహిరంగ విచారణ

### హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహణ

ఖిలావరంగల్, అక్టోబర్ 24 : హనుమకొండ కలెక్టరేట్‌లో నవంబర్ 2న తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ లేదా కార్యదర్శి పేరిట బహిరంగ విచారణ ఉంటుందని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని ఆసక్తి ఉన్న ప్రజాప్రతినిధులు వారి కులాల్లోని రాజకీయ, సామాజిక, ఆర్థిక పరమైన అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను చైర్మన్ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అయితే బహిరంగ విచారణ రోజున 6 సెట్ల కాపీలతో పాటు అఫిడవిట్ (రూ.20 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపరుపై) సమర్పించి ప్రత్యక్ష విచారణలో పాల్గొనాలని పేర్కొన్నారు.

# పాఠశాలలోకి రక్తపింజర

- అకినేపల్లిమల్లారంలో ఘటన
- స్థానికుల సహకారంతో చంపిన సిబ్బంది


పాఠశాలలోకి వచ్చిన రక్తపింజర

మంగపేట, అక్టోబర్ 24 : ములుగు జిల్లా మంగపేట మండలం అకినేపల్లిమల్లారం ప్రాథమికోన్నత పాఠశాలలోకి గురువారం రక్తపింజర వచ్చింది. వెంటనే ఆ పామును గుర్తించిన సిబ్బంది స్థానికులతో కలిసి చంపేశారు. అత్యంత విషపూరితమైన పామును వెంటనే గమనించి చంపకపోతే విద్యార్థులకు పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. పాఠశాల ఆవరణలో గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచి విష పురుగులకు ఆవాసంగా మారిందని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్ల తరచూ తరగతి గదుల్లోకి పాములు, తేళ్లు వస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు.

# ఏసీబీకి చిక్కిన అవినీతి చేపలు

- సీసీ రోడ్డు బిల్లు కోసం పీఆర్ ఉద్యోగులు లంచం డిమాండ్
- రూ. 20 వేలు తీసుకుంటూ పట్టుబడిన ఈఈ, ఏటీవో, సీనియర్ అసిస్టెంట్


ఏసీబీకి పట్టుబడిన పీఆర్ ఈఈ దిలీప్, ఏటీవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అవినీతి చేపలు ఏసీబీకి చిక్కాయి. సీసీ రోడ్డు బిల్లు కోసం పీఆర్ ఉద్యోగులు లంచం డిమాండ్ చేయగా, కాంట్రాక్టర్ ఏసీబీకి సమాచారమివ్వడంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాంట్రాక్టర్ కుంట సదానందం 2023లో తాడిచెర్లలో రూ.10 లక్షలతో రెండు సీసీ రోడ్ల పనులు పూర్తి చేయగా, అధికారులు రూ. 5.83 లక్షలు చెల్లించారు. ఇంకా రూ. 4.17 లక్షల బిల్లు కోసం సదానందం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. బిల్లు చెల్లించాలంటే ఈఈ రూ. 20 వేలు డిమాండ్ చేశాడు. దీంతో సదానందం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈక్రమంలో గురువారం సదానందం పంచాయతీరాజ్ కార్యాలయానికి వెళ్లి ఈఈ దిలీప్ కుమార్‌కు రూ. 10 వేలు, ఏటీవో చంద్రశేఖర్ కు రూ. 5 వేలు, సీనియర్ అసిస్టెంట్ శోభారాణికి రూ. 5 వేలు అందజేశాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వెంటనే డబ్బులను స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు చేశామని, శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఎవరైనా లంచం కోసం వేధిస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, ఎస్ రాజు, ఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు. పీఆర్ ఈఈతోపాటు కార్యాలయ ఉద్యోగులు ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

### చాలా ఇబ్బంది పెట్టారు



నేను మా సొంతూరు తాడిచెర్లలో 2023లో పీఆర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన రెండు సీసీ రోడ్డు పనులను చేశాను. రూ. 10 లక్షల బిల్లులు రావాల్సి ఉండగా, రూ. 5.83 లక్షలు బలవంతంగా చెల్లించారు. ఇంకా రూ.4.17 లక్షలు రావాల్సి ఉంది. ఈ బిల్లు కోసం ఈఈతో పాటు ఏటీవో, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి సైతం ఇబ్బంది పెట్టారు. దీంతో విసిగిపోయి ఏసీబీ అధికారులను ఆశ్రయించాను.

– బాధితుడు కుంట సదానందం

# వర్ధన్నపేట కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- గ్రామ కమిటీల్లో అన్యాయం జరుగుతన్నదని ఆగ్రహం
- వలస నేతలే చక్రం తిప్పతున్నారని శ్రేణుల మండిపాటు
- సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయిన ఎమ్మెల్యే నాగరాజు


కార్యకర్తల ఆందోళనతో కారెక్కి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే నాగరాజు

రాయపర్తి(వర్ధన్నపేట), అక్టోబర్ 24: వర్ధన్నపేట నియోజకవర్గవ్యాప్తంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సాక్షిగా విభేదాలు భగ్గుమన్నాయి. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అక్కడి నుంచి బయలుదేరేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు దొమ్మాటి మల్లయ్య, మక్సూద్, శివరాత్రి తిరుపతి, మంజూరు అహ్మద్, సమ్మెట రాంబాబులతో పాటు సుమారు 100 మంది కార్యకర్తలు ఇందిరమ్మ గ్రామ కమిటీల్లో తమకు అన్యాయం జరుగుతున్నదని ఎమ్మెల్యే నాగరాజుతో వాదించారు. పార్టీ పటిష్టత, ఎమ్మెల్యేగా గెలుపు కోరుతూ కష్టపడి పనిచేసిన తమను కాదని గ్రామాల్లో ఇటీవల పార్టీలో చేరుతున్న వలస నేతలు చక్రం తిప్పుతున్నారని మండిపడ్డారు. ఎన్నో ఏండ్లుగా పార్టీనే నమ్ముకున్న తమకు వలస నేతల రూపంలో ఎమ్మెల్యే నాగరాజు సరైన బహుమతే అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తమకు గుర్తింపే లేనప్పుడు పార్టీ కోసం ఎందుకు పని చేయాలని ప్రశ్నించారు. దీంతో పార్టీ శ్రేణులకు సమాధానం చెప్పకుండానే ఎమ్మెల్యే మౌనంగా కారెక్కి వెళ్లిపోవడం గమనార్హం.


న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న మహేశ్ కుటుంబ సభ్యులు, బంధువులు

# హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- మృతుడి కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన
- మానుకోట జిల్లా సీతంపేటలో మూడు గంటల పాటు ఉత్కంఠ
- ఎస్పీ హామీతో ఆందోళన విరమణ

గార్ల, అక్టోబర్ 24: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట గ్రామంలో హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు గురువారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గుమ్మడి మహేశ్ (32) ఎంపీడీవో కార్యాలయంలో కాంట్రాక్ట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 20న ఇంట్లో నోట్లోంచి రక్తం కారుతూ, తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతుడు తమ్ముడి ఫిర్యాదు మేరకు గార్ల పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు విచారణ చేపట్టగా మృతుడి ఇంటిపక్కన ఉండే గంధసిరి కృష్ణ, అతడి భార్య మంజుల మహేశ్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులిద్దరిని బయ్యారం సీఐ రవి కుమార్, గార్ల ఎస్సై జీనత్ కుమార్ విచారణ కోసం సీతంపేటకు తీసుకొచ్చారు. మహేశ్ హత్యలో వీరిద్దరితోపాటు మరో ముగ్గురు ఉన్నారని, నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మూడు గంటలు పాటు గ్రామంలో ఉత్కంఠం నెలకొన్నది. చివరికి మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వచ్చి నిందితులను కఠినంగా శిక్షిస్తామని, ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ హామీతో మహేశ్ బంధువులు ఆందోళన విరమించారు.


ఆనవాళ్లు పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారిణి జరీనా బేగం

# చిల్పూరులో పులి సంచారం!

- స్థానిక రైతుల ఫిర్యాదు
- ఆనవాళ్లు పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు

చిల్పూరు, అక్టోబర్ 24 : జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని గుట్ట దిగువ ప్రాంతంలో పులి సంచరిస్తున్నదన్న స్థానిక రైతుల ఫిర్యాదు మేరకు గురువారం ఫారెస్ట్ అధికారి జరీనా బేగం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులి సంచరిస్తున్నట్లు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, స్థానిక రైతులు మూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కేఎంసీలో క్రితి-24

- రెండు రోజులపాటు వేడుకలు
- దేశవ్యాప్తంగా వైద్యవిద్యార్థుల ఆలోచనలను పంచుకునేలా వేదిక
- ఏడు విభాగాల్లో పాల్గొననున్న మెడికల్ స్టూడెంట్స్



మాట్లాడుతున్న యూఎస్‌ఏ అలుమ్ని ప్రతినిధి డాక్టర్ వేణు

వరంగల్ చౌరస్తా, అక్టోబర్24: నేటి నుంచి కేఎంసీలో కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్-24(క్రితి-24)ను నిర్వహించనున్నారు. గురువారం కేఎంసీ ఎన్‌ఆర్ఐ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పరిశోధనల ద్వారా పూర్తిస్థాయి విశ్లేషణతో విజ్ఞానాన్ని సముపార్జించే విధానాన్ని అలవాటు చేయడంతో పాటు గా దేశవ్యాప్తంగా ఉన్న వైద్యవిద్యార్థుల ఆలోచనలను పంచుకునేలా వేదికను ఏర్పాటు చేసి నట్లు పేర్కొన్నారు. అలుమ్ని (కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం)తో పాటుగా యూఎస్‌ఏ అలుమ్ని విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూజీ, పీజీ విద్యార్థులకు 7 విభాగాలుగా కార్యక్రమాలను రూపొందించామన్నారు. శుక్రవారం డిబేట్, హాకథాన్, జెపార్డీ(క్విజ్) కార్యక్రమాలు, శనివారం పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రె జెంటేషన్, సింపోజియం కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 100 వైద్యకళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొనబోతున్నారని, వెయ్యికి పైగా వచ్చిన రిజిస్ట్రేషన్లలో 350 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు భారీ నగదు, ప్రోత్సాహక బహుమతులు సైతం అందించనున్నామని తెలిపారు. యూఎస్‌ఏ అలుమ్ని ప్రతినిధి డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు బత్తిని తదితరులు పాల్గొన్నారు.